

ఇంకా అందని మత్స్యకార భృతి

నరసాపురం, జూలై 11 : నరసాపురం, మొగల్తూరు సముద్ర తీర మండలాల్లోని 1,773 మంది మత్స్యకారులకు వేట నిషేధ భృతి అందని ద్రాక్షగా మారింది. ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు రెండు నెలలపాటు సముద్రంలో వేట నిషేధం అమలులో ఉంటుంది. ఈ కాలంలో మత్స్యకారుల ఉపాధి నిమిత్తం ప్రభుత్వం నెలకు రూ.10 వేలు చొప్పున రెండు నెలలకు రూ.20 వేలు ఇవ్వాలి. ఈ సారి ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో వారి ఖాతాల్లో జమ కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. మరోవైపు వేట నిషేధ గడువు ముగిసింది. అయినా భృతి అందకపోవడంతో సొమ్ముల కోసం వీరంతా మత్స్య శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.



20న మాధవాయిపాలెం రేవు పాట నిర్వహణ

నరసాపురం, జూలై 11 : మాధవాయిపాలెం రేవు పాట ఈ నెల 20న నిర్వహించనున్నట్లు గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. పాట ప్రారంభ ధర రూ.3.61 కోట్లు. 19వ తేదీ మధ్యాహ్నం వరకు షెడ్యూల్ ఫారాలు విక్రయించి, 20న సీల్ టెండర్లు స్వీకరిస్తారు. అదే రోజు మధ్యాహ్నం మూడు గంటలకు బహిరంగ, సీక్రెట్ వేలం నిర్వహిస్తారు. ఈ రెండింటిలో ఎవరు హెచ్చు మొత్తంలో పాడుకుంటే రేవు నిర్వహణ వారికి అప్పగిస్తామని ఇన్‌చార్జ్ ఎంపీడీవో వీరభద్రరావు చెప్పారు.



ఈ గొయ్యి మాది కాదు..!

చింతలపూడి, జూలై 11 : ఏలూరు జిల్లా చింతలపూడి పట్టణంలో ఆర్ అండ్‌బీ రోడ్డుపై కొన్ని నెలలుగా ఒక పెద్ద గొయ్యి ఏర్పడింది. ఇందులో పడి వాహనాలు దిగబడిపోతున్నాయి. అవి పైకి రాలేక ఎక్స్‌కవేటర్లను వినియోగించాల్సి వస్తోంది. దిగబడిన లారీల వల్ల ట్రాఫిక్ జామ్ అవుతోంది. వర్షం వచ్చినప్పుడు ద్విచక్ర వాహన దారులు జారి పడిపోతున్నారు. నిత్యం వందలాది వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. అటు ఆర్‌అండ్‌బీ, ఇటు నగర పంచాయతీ అధికారులు ఈ పని తమది కాదంటే తమది కాదని పక్కన పెడుతున్నాయి. గురువారం ఇలా ఓ లారీ ఇరుక్కుపోవడంతో ఎక్స్‌కవేటర్ సాయంతో తీశారు. ఈ విషయం తెలిసిన ఎమ్మెల్యే సొంగా రోషన్ గొయ్యిని పూడ్చాలని ఆర్‌అండ్‌బీ అధికారులను హెచ్చరించారు. అప్పుడు కాని వారు కదల్లేదు.



ఈ చికెన్ తిన్నారో.. ఇకంతే
తనిఖీల్లో బట్టబయలు
- 7లో

గ్రంథి సైలెంట్

భీమవరం వైసీపీలో శాసనమండలి చైర్మన్ వర్సెస్ మాజీ ఎమ్మెల్యే అన్నట్టు ఉంది. మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఇటీవల వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు కనిపించలేదు. అన్ని నియోజకవర్గాల్లోను నియోజకవర్గ బాధ్యులు ఈ కార్యక్రమాలను నిర్వహించినప్పటికీ ఇక్కడ ఆయన పాల్గొనలేదు. మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు నిర్వహించారు. పార్టీలో ఇప్పుడిదే చర్చనీయాంశమై, కేడర్‌లో అయోమయం నెలకొంది. మరోవైపు మోషేన్ నిర్వహించిన కార్యక్రమానికి ఎందుకు వెళ్లారంటూ గ్రంధి తమ కేడర్‌ను ప్రశ్నించినట్టు ప్రచారం జరుగుతోంది.

వైఎస్ఆర్ జయంతి వేడుకలకు దూరం

- ఎన్నికల్లో ఓటమిపై అంతర్మథనం.. శాసనమండలి చైర్మన్‌పై అనుమానం
- తమకు వ్యతిరేకంగా పనిచేశారంటూ ఆరోపణలు
- ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ వర్గం
- మెజారిటీ వచ్చిన మూడు బూత్‌లూ తమవేనని మోషేన్ వర్గం వాదన

(భీమవరం-ఆంధ్రజ్యోతి):

ఐదేళ్లుగా భీమవరం వైసీపీలో వర్గపోరు ఉంది. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నియోజక వర్గంలో అంతా తానై వ్యవహరించారు. మోషేన్ రాజు శాసనమండలి చైర్మన్ అయిన తర్వాత.. అప్పటి వరకు పార్టీలో అసంతృప్తిగా ఉన్న వర్గం అతనికి దగ్గరయ్యారు. గడచిన ఎన్నికల్లో శ్రీనివాస్ ఓటమి పాలయ్యారు. ఆ ఎన్నికల్లో మోషేన్‌రాజు పనిచేయలేదంటూ గ్రంధి వర్గం ఆరోపిస్తోంది. అయినప్పటికి జగన్ మండలి చైర్మన్‌కు పెద్దపీట వేస్తున్నారంటూ గ్రంధి వర్గం కారాలు మిరియాలు నూరుతోంది. వాస్తవానికి గడిచిన ఎన్నికల్లో శ్రీనివాస్ ఒకవైపు, మోషేన్ వర్గం మరోవైపు అన్న రీతిలో ప్రచారం చేసుకున్నారు. ఇద్దరూ ఒక్కసారి కలిసిన సందర్భాలు లేవు. నిజానికి మండలి చైర్మన్ హోదాలో మోషేన్‌రాజు ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండాలి. అయినప్పటికి రాజకీయంగా ఇద్దరు నేతలు కలిసే ఉన్నారన్న సంకేతాలు పంపాలి. అలా జరగలేదు. ఎవరికి వారే అన్న రీతిలో ఉండిపోయారు. ఎన్నికల్లో గ్రంధి శ్రీనివాస్.. మోషేన్ మద్దతు కోరలేదంటూ ఈయన అనుచరవర్గం చెబుతోంది. ఉద్దేశ పూర్వకంగానే గ్రంధికి మద్దతుగా మోషేన్ వ్యవహరించలేదంటూ ఆయన వర్గం విశ్వసిస్తోంది. మొత్తానికి నియోజకవర్గంలో ప్రతికూల ఫలితం వెలువడింది. అయితే ఎమ్మెల్యే అంజిబాబు విజయం సాధించిన తర్వాత మోషేన్‌రాజును మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికల ముందు సివిల్స్‌లో ర్యాంక్ సాధించిన మోషేన్‌రాజు కుమారుడిని అంజిబాబు సత్కరించారు. ఈ రెండు ఘటనలతో మండలి చైర్మన్ అంజి బాబుకు మద్దతుగా వ్యవహరించారంటూ గ్రంధి వర్గం అనుమానిస్తోంది. మోషేన్ వర్గం దీనిని పూర్తిగా కొట్టి పడేస్తోంది. ఎన్నికల్లో సామాజిక వర్గాల వారీగా నియోజకవర్గంలో సమావేశాలు ఏర్పాటు చేసి, వైసీపీ ప్రభుత్వం పేదలకు చేసిన సేవలను గుర్తు చేశారు. మళ్లీ జగన్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. నియోజక వర్గంలో 238 పోలింగ్ బూత్‌లు వుంటే మూడింటిలో అంటే గునుపూడి ప్రాంతంలోని 117, 118, 144 బూత్‌ల్లోనే వైసీపీకి మెజారిటీ వచ్చింది. ఈ మూడూ మండలి చైర్మన్ సొంత ప్రాంతాలని ఆయన అనుచర వర్గం చెబుతోంది. మిగిలిన చోట్ల మెజారిటీ ఎందుకు రాలేదంటూ ప్రశ్నిస్తోంది.



ఓటమికి బాధ్యులెవరు ?

భీమవరం నియోజకవర్గంలో 67 వేల ఓట్ల తేడాతో వైసీపీ పరాజయం పాలయ్యింది. జిల్లాలో ఆచంట మినహా మిగిలిన నియోజక వర్గాల్లో భారీ తేడాతో వైసీపీ అభ్యర్థులు ఓటమిని చవి చూశారు. స్థానిక నేతలపై వ్యతిరేకతతోపాటు, జగన్ ప్రభుత్వంపై ఉన్న ప్రజాగ్రహమే ఇంతటి దారుణ ఓటమికి కారణమైంది. కానీ భీమవరంలో మాత్రం ఓటమికి ఒకరిపై మరొకరు వేలెత్తి చూపుకొనే పరిస్థితి వైసీపీలో నెలకొంది. నియోజకవర్గం మండలి చైర్మన్‌కు పార్టీ అధినేత జగన్ అమిత ప్రాధాన్యం ఇస్తున్నారంటూ గ్రంధి వర్గం కస్సుబుస్సులాడుతోంది. ఎప్పుడూ కలిసి వెళ్లకుండా మోషేన్‌కు దూరంగా ఉంటూ గ్రంధి రాజకీయాలు నెరపారంటూ మరో వర్గం వాదిస్తోంది. మొత్తంపైన భీమవరంలో వైసీపీ కేడర్ అయోమయంలో పడిపోయింది. శ్రీనివాస్ పార్టీకి దూరంగా ఉంటున్నట్టు కార్యకర్తల్లోకి సంకేతాలు వెళుతున్నాయి. జగన్ ప్రస్తుత తరుణంలో మండలి చైర్మన్‌పై పార్టీపరంగా చర్యలు తీసుకోవాలంటూ గ్రంధి వర్గం నుంచి డిమాండ్ వినిపిస్తోంది. మొత్తంపైన భీమవరంలో వైసీపీ కేడర్ ఆత్మరక్షణలో పడిపోయింది.



మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కక్షిదారుల పడిగాపులు

రిజిస్ట్రేషన్లకు సర్వర్ డౌన్

- కక్షిదారుల అసహనం

ఆచంట/మొగల్తూరు, జూలై 11 : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సర్వర్ డౌన్ కావడంతో రిజిస్ట్రేషన్ల విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. రిజిస్ట్రేషన్ శాఖ ఇటీవల కొత్తగా తీసుకువచ్చిన 2.0 విధానం ద్వారా తరచూ ఏదో ఒక సమస్య తలెత్తుతూనే ఉంది. దీంతో రిజిస్ట్రేషన్‌లు సజావుగా సాగక, ఆటంకాలు ఎదురవుతు న్నాయి. దీంతో కక్షిదారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద గంటల తరబడి వేచి ఉన్నప్పటికీ సర్వర్ సమస్యతో పని పూర్తికాక కక్షిదారులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. గురువారం జిల్లావ్యాప్తంగా సర్వర్లు సరిగ్గా పనిచేయక రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ప్రభుత్వానికి ఈ శాఖ ద్వారా రోజూ కోట్ల రూపాయలు ఆదాయం వస్తున్నప్పటికీ అధికారులు సరిగ్గా పట్టించుకోకపోవడం దారుణమని కక్షిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి కోట్ల రూపాయలు ఆదాయాన్ని తెచ్చే రిజిస్ట్రేషన్ విషయంలో తరచూ అనేక నిబంధనలు పెడుతున్న కారణంగా కక్షిదారులు అవస్థలు పడుతున్నారు. సంబంధిత శాఖల అధికారులు స్పందించి సర్వర్ సమస్య తలెత్తకుండా చూసి రిజిస్ట్రేషన్‌లు సజావుగా అయ్యేటట్లు చూడాలని కక్షిదారులు కోరుతున్నారు. ముహూర్తాలు పెట్టుకుని మరీ మొగల్తూరు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చిన వచ్చిన పలువురు సర్వర్లు పని చేయక వెనుదిరిగారు. సర్వర్లు పనిచేయక రేషన్ డోర్ డెలివరి గురువారం మధ్యాహ్నం నుంచి నిలుపుదల చేశారు. దీంతో వినియోగదారులు, ఎండీయూ ఆపరేటర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

దర్భరేవుకు మోక్షమేది ?



కొత్తకాయలతిప్ప వద్ద రెగ్యులేటర్ నిర్మాణ ప్రాంతం
పూడుకుపోయిన దర్భరేవు డ్రెయిన్

చేలల్లో మురుగు నీరు లాగక రైతుల ఇబ్బందులు

మొగల్తూరు, జూలై 11 : దర్భరేవు డ్రెయిన్ ప్రక్షాళనకు నోచుకోకపోవడంతో సుమారు పది గ్రామాల రైతులు చేలల్లో మురుగునీరు లాగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నరసాపురం మండలం దర్భరేవు నుంచి ప్రవహించే ఈ డ్రెయిన్ మొగల్తూరు శివారు ముత్యాలపల్లి ఉప్పుటేరులో కలుస్తోంది. పది పంచాయతీల పరిధిలోని వరి, చేపల చెరువుల్లో మురు నీరు ఈ డ్రెయిన్‌లో ప్రవహిస్తోంది. డ్రెయిన్‌లో గుర్రపు డెక్క, తూడు, చెత్తా చెదారాలు పేరుకుపోయి పూడుకుపోయింది. ప్రస్తుతం ఈ డ్రెయిన్‌పై అవతల గట్టు నుంచి ఇవతల గట్టుకు నడిచే విధంగా తయారైంది. ఈ డ్రెయిన్ మురుగు లాగకపోవడంతో మొగల్తూరు పంచాయతీ పరిధి కొత్తకాయలప్ప, రామన్నపాలెం పంచాయతీ పరిధి అడవిపల్లలో సుమారు రెండు వేల ఎకరాల వరి చేలల్లో మురుగు నీరు లాగడం లేదు. ఉప్పుటేరు ఆటు పోటులకు ఈ డ్రెయిన్ నీరు చేలల్లోకి రావడంతో చేలు సైతం ముంపుకు గురవుతున్నాయి. అధిక వర్షాల సమయంలో డ్రెయిన్ నీరు చేలల్లోకి వచ్చి ఆకుమడులు సైతం ముంపునకు గురవుతున్నాయి. దీంతో గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఆయకట్టు రైతులు ముంపు నష్టాలను చవిచూడలేక సార్వా సాగు విరామం చేశారు. రామన్నపాలెం, మొగల్తూరు పరిధిలో ఈ ఆయకట్టులో ఈ ఏడాది సార్వా సాగుకు సమాయత్తం అయినప్పటికి ముంపు ప్రభావంతో సాగు చేయాలా ? వద్దా ? అనే మీమాంసలో రైతులున్నారు. ఈ డ్రెయిన్ ప్రక్షాళనకు గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కొత్తకాయలతిప్ప వద్ద రూ.4 కోట్లు రెగ్యులేటర్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అయితే కొద్ది రోజుల్లో 2019 సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో పనులు సాగలేదు. మళ్ళీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున ఈ డ్రెయిన్‌కు రెగ్యులేటర్, ప్రక్షాళన పనులు చేపట్టి ఆయకట్టు రైతుల సాగుకు సహకరించాలని ఆయకట్టు రైతులు కోరున్నారు.



రెగ్యులేటర్ నిర్మించాలి

యాతం పాండు రంగారావు, రైతు



దర్భరేవు డ్రెయిన్ పూడుకుపోవడంతో చేలల్లో మురుగునీరు లాగడం లేదు. దర్భరేవు నుంచి మొగల్తూరు శివారు సుమారు పది గ్రామాల్లో విస్తరించి వున్న ఈ డ్రెయిన్‌ను ప్రక్షాళన చేసి కొత్తకాయలతిప్ప వద్ద డ్రెయిన్‌పై రెగ్యులేటర్ నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుంది. తెలుగుదేశం హయాంలో మంజూరైన రెగ్యులేటర్ నిధులు మళ్ళీ కూటమి ప్రభుత్వం హయాంలో తీసుకువచ్చి వేలాది ఎకరాల్లో సాగు చేసుకున్న రైతులు నష్టపోకుండా ఉండేందుకు రెగ్యులేటర్ నిర్మించాలని కోరుతున్నాం.

ప్రక్షాళనతో రైతులకు మేలు

లక్కు, రాంబాబు, రైతు, కొత్తకాయలతిప్ప



దర్భరేవు డ్రెయిన్ ప్రక్షాళనతో పది పంచాయతీల్లోని రైతులకు ఎంతో మేలు జరిగే అవకాశం ఉంది. డ్రెయిన్ పూడుకుపోవడం, గుర్రపు డెక్క, తూడు పేరుకుపోవడంతో ప్రవాహం జరగడం లేదు. డ్రెయిన్ ఆటు పోట్ల ప్రభావంతో చేలల్లో మురుగు నీరు చేరి తీవ్రంగా నష్టపోతున్నాం. రైతుల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం డ్రెయిన్ ప్రక్షాళన చేయాలని కోరుతున్నాం.



సార్వాలో సాగు నీటి కష్టాలు

ఆచంట, జూలై 11 : జిల్లావ్యాప్తంగా అన్నిచోట్ల సార్వా పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. నాట్లు వేసేందుకు దమ్ములు చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే ఆచంట మండలంలో పలుచోట్ల సార్వా నాట్లు మొదలయ్యాయి. అయితే వర్షాలు పూర్తిస్థాయిలో పడకపోవడం, బ్యాంక్ కెనాల్‌లో నీరు అంతంతమాత్రంగానే వస్తుండటంతో రైతులు దమ్ములకు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి చోట్ల బోర్ల ద్వారా నీటిని తోడి దమ్ములు చేస్తున్నారు.

విద్యార్థులందరికి తల్లికి వందనం

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 11 : తెలుగుదేశం కూటమి ప్రభుత్వం మరో హామీని నెరవేర్చనుంది. తల్లికి వందనం పథకంతో కుటుంబంలో ఎంత మంది పిల్లలున్నా ఏడాదికి రూ.15 వేలు వంతున మంజూరు చేయనుంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వర్తిస్తుంది. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. విద్యా సంవత్సరానికి 75 శాతం విద్యార్థి హాజరు తప్పనిసరి. తెల్ల రేషన్ కార్డుదారులు అందరూ అర్హులే. ఆదాయ పన్ను పరిధిలోకి వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆస్తులున్న వారికి ఇది వర్తించదు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో రెండు లక్షల 17 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో పది శాతం మంది దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్నారు. మిగిలిన 90 శాతం మంది విద్యార్థులకు తల్లికి వందనం కింద ఏడాదికి రూ.15 వేలు చొప్పున లబ్ధి పొందనున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి పథకంలో విద్యార్థికి రూ.15 వేలు అని ముందు చెప్పారు. తర్వాత కుటుంబంలో ఒక విద్యార్థికే అన్నారు. మరుసటి విద్యా సంవత్సరం పాఠశాల మెయింటినెన్స్ వంకతో రూ.1000 కట్ చేసి రూ.14 వేలు ఇచ్చారు. మూడో సారి రెండు వేలు మెయింటినెన్స్ లెక్కలోకి తీసుకువెళ్ళి తల్లికి రూ.13 వేలతో సరి పెట్టారు. గడిచిన ఐదేళ్లలో నాలుగు దఫాలుగా మాత్రమే అమ్మ ఒడి ఇచ్చారు. ఒక విద్యా సంవత్సరం ఎగనామం పెట్టారు. అప్పట్లో రెండు లక్షల 25 వేల మంది విద్యార్థులుంటే లక్షా 43 వేల మందికే అమ్మ ఒడి ఇచ్చి మిగిలిన వారికి ఎగనామం పెట్టారు.

జవాన్ పదవీ విరమణ.. ఘన స్వాగతం



భీమవరం టౌన్, జూలై 11 : దాసరి దుర్గారమేష్.. దేశ సరిహద్దులైన జమ్మూ కాశ్మీర్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్ బోర్డర్లలో ఎన్‌సీవో హెడ్‌గా 23 ఏళ్లుగా దేశ రక్షణలో సేవలందించారు. ఇటీవల పదవీ విరమణ చేసి తిరిగి స్వస్థలానికి చేరుకున్న ఆయనకు భీమవరంలో బంధువులు, అభిమానులు, స్నేహితులు ఘన స్వాగతం పలికి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భీమవరం క్విట్ ఇండియా స్థూపం వద్దకు చేరుకుని త్యాగమూర్తులకు రమేష్ నివాళులర్పించారు.

21 కాదు.. 9 అడుగులే!



మొగల్తూరులో వెరైటీగా రోడ్డు నిర్మాణం.. వాహనదారుల అగచాట్లు

మొగల్తూరు, జూలై 11 : మొగల్తూరు గ్రామంలో 21 అడుగుల వెడల్పు, మూడు కిలోమీటర్ల పొడవున ఆర్‌అండ్‌బీ రోడ్డు ఉంది. 216 జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తమ వాహనాల రాకపోకల నిమిత్తం ఎన్‌హెచ్ అధికారులు ఈ రోడ్డును తీసుకున్నారు. వారి పనులు పూర్తయిన తర్వాత దీనిని నిర్మించి ఇవ్వాలని కండీషన్. ఇటీవల మొగల్తూరు గ్రామ శివారు ప్రాంతంలో జాతీయ రహదారి నిర్మాణం పూర్తయ్యింది. కండీషన్ ప్రకారం.. జాతీయ రహదారి అధికా రులు ఆర్‌అండ్‌బీ రహదారిని పునఃనిర్మించి అప్పగించాలి. అయితే 21 అడుగులు నిర్మించాల్సిన రోడ్డును కేవలం తొమ్మిది అడుగులు మాత్రమే వేస్తున్నారు. ఈ కారణంగా రోడ్డుకు రెండు వైపులా మార్జిన్ లేదు. దీనిపై ఎవరైనా ప్రయాణిస్తే పడిపోవడం ఖాయం. గ్రామం మీదుగా వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సులు జాతీయ రహదారి మీదుగా వెళ్లిపోవడంతో ప్రయాణీకులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై గ్రామస్తులు ఇటీవల ఈ రోడ్డు నిర్మాణ పనులు అడ్డుకుని ఆందోళన చేశారు. నిబంధనల ప్రకారమే రోడ్డు నిర్మిస్తున్నామని, ఏమైనా అభ్యంతరాలు వుంటే జాతీయ రహదారుల అధికారులకు తెలియజేయాలని కాంట్రాక్టర్ తేల్చి చెప్పారు. రోడ్డు నిర్మాణం గురువారంతో పూర్తిచేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్డు ముంపునకు గురై నీరంతా షాపుల్లోకి చేరడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బైక్‌లు, సైకిళ్లపై వెళుతున్న వారు పడిపోయి గాయాలపాలవుతున్నారు. ఈ నేపథ్యంలో ఉన్న మాదిరిగా 21 అడుగులు వేయాలని స్థానికులు కోరుతున్నారు.



అవగాహనతోనే కుటుంబ నియంత్రణ

భీమవరం టౌన్, జూలై 11 : వివాహ వయసు, కుటుంబ నియంత్రణలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించడం ద్వారా జనాభా నియంత్రణకు దోహదపడుతుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ జనాభా దినోత్సవంలో కుటుంబ నియంత్రణకు కృషి చేసిన వైద్య సిబ్బందికి అవార్డులు ప్రదానం చేశారు. వీరిలో స్త్రీ వైద్య నిపుణులు, వేసెక్టమి సర్జన్, కౌన్సిలర్లు, ఏఎన్ఎంలు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు వున్నారు. అత్యధిక ఆపరేషన్లు చేసిన పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్‌వీ రంగం నాయుడు, తణుకు పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.దుర్గా మహేశ్వరరావులకు అవార్డులను కలెక్టర్ అందించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ భానునాయక్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ దేవసుధ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతుసంఘ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలు కావాలి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య

ద్వారకాతిరుమల, జూలై 11: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలు అమలు కావాలని,60 శాతం మంది ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని పాలకులు చిన్నచూపు చూస్తున్నారని ఏపీ రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య విమర్శించారు. ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లిలో గురువారం జరిగిన రైతు సంఘ జిల్లా స్థాయి శిక్షణా తరగతులకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. మన దేశంలో పండే రొయ్యలు, మిర్చి, పత్తి, పొగాకు తదితర పంటలను ఇతర దేశాలకు ఎగుమతులు చేస్తున్నామని, రైతులు ఎంత కష్టబడినా కనీస మద్దతు ధర కరువైందని ఆవేదన చెందారు. జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లను బిగించడం ఆపాలని ఎక్కడైనా మీటర్లు బిగిస్తే రైతులు ఐక్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా ద్వారకాతిరుమల, దెందులూరు మండలాలకు సాగునీరందించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘ నాయకులు కట్టా భాస్కరరావు, జి.ప్రసాదరావు, గారపాటి వెంకట సుబ్బారావు, బొడ్డు రాంబాబు, సిరిబత్తుల సీతారామయ్య, కె.జలపాలు, కొనా శ్రీనివాసరావు, జి.సురేష్, నందమూరి సుబ్బారావు, బోయపాటి సత్యనారాయణ, టి.మురళి, జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పే అండ్ అక్కౌంట్స్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వినతి



మంత్రి కేశవ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హరనాథ్

ఏలూరు అర్బన్, జూలై 11: పే అండ్ అక్కౌంట్స్ కార్యాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగిన ఆదేశాలు జారీచేయాలని అభ్యర్థిస్తూ గురువారం రాష్ట్ర సచివా లయంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం అందజేసినట్టు ఏపీ పేఅండ్ అకౌంట్స్ ఆఫీస్ (వర్క్ అకౌంట్స్) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ హరనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల సర్వీస్ మేటర్స్‌లో ఎదు ర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ ఇచ్చారని వివరించారు. ఉద్యోగులు కూడా నిబంధనలకు లోబడి కష్టపడి పనిచేసి ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడటంలో కృషి చేయాలని సూచించారని తెలిపారు. మంత్రిని కలిసిన సంఘ నాయకుల్లో నాగభూషణం, శ్రీనివాసరావు తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వీఎల్ ఇందిరాదత్

సౌర విద్యుత్‌పైనే ప్రపంచ దృష్టి

భీమవరం టౌన్, జూలై 11 :సౌర విద్యుత్ పైనే ప్రపంచం దృష్టి ఉందని, 2023 నాటికి భారతదేశంలో 5.8 శాతం సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెరిగిందని ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ డాక్టర్ వీఎల్ ఇందిరా దత్ అన్నారు. భీమవరంలో ఓఆర్‌బీ ఎనర్జీ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో గురువారం సోలార్ ఎనర్జీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందిరా దత్ మాట్లాడుతూ ఇప్పటికే పెద్ద హోటళ్లు, హాస్పటళ్లు వంటివి సోలార్ ప్యానల్స్ పెట్టుకుంటున్నాయని, ఇది ప్రపంచంలో మన స్థానాన్ని బాగా మెరుగుపరచిందన్నారు. 2023లో ప్రపంచంలోనే మూడో అతి పెద్ద సౌర విద్యుత్ జనరేటర్‌గా అవతరించిందని, వేగవంతమైన సౌర విద్యుత్ విస్తరణలో జపాన్‌ను అధిగమిం చామన్నారు. దేశంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి 2015లో 0.5 శాతం ఉండగా 2023 నాటికి 5.8 శాతానికి పెరిగిందన్నారు. కార్యక్రమంలో కో చైర్మన్ కే.శ్రీనివాసరావు, వెంకట్, కృష్ణ వంశీ,రంగసాయి, అరసవల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



వేలేరుపాడులో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

బోరుగడ్డ అనిల్‌పై పోలీసులకు ఫిర్యాదు

వేలేరుపాడ, జూలై 11: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్, ఇతర టీడీపీ నాయకులపై బోరుగడ్డ అనిల్ వ్యక్తిగత విమర్శలతో పాటు వారి కుటుంబాలపై కూడా విమర్శలు చేయడం పట్ల వేలేరుపాడు పోలీస్ స్టేషన్‌లో టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ సానుభూతిపరుడుగా ఉన్న అనిల్ అప్పటి ప్రతిపక్ష నాయకులపై ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నాడని గతంలో కూడా అతనిపై టీడీపీ నాయకులు ఫిర్యాదు చేసినప్పటికి అప్పటి వైసీపీ ప్రభుత్వంలోని పోలీసులు కనీసం ఫిర్యాదు కూడా తీసుకోలేదన్నారు. దీంతో మరింత రెచ్చిపోయిన అనిల్ తన దూషణల పర్వాన్ని కొనసాగిస్తూనే ఉన్నాడని అతనిపై తక్షణం చర్యలు తీసుకుని చట్టపరంగా శిక్షించాలని కోరుతూ గురువారం టీడీపీ నాయకులు చీమల వెంకటేశ్వర్లు, యాళ్ళ శంకరరావు, పసుమర్తి మోహన్, మహిళా నాయకురాలు రాణి వేలేరుపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



శ్యామలాంబ, రామలింగేశ్వరస్వామికి ఆషాఢం సారె

కైకలూరు జూలై 11 : ఆషాఢ మాసం సందర్భంగా కైకలూరు శ్యామలాంబ అమ్మవారికి, శ్రీపార్వతి సమేత రామలింగేశ్వరస్వామికి కైకలూరుకు చెందిన పలువురు మహిళలు సారెను అందజేశారు. గురువారం కైకలూరు బ్రహ్మంగారి గుడి వీధి, కాల్వ గట్టు నుంచి మహిళలు పెద్దఎత్తున సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి, స్వామివారికి అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వీఎస్‌కే శేఖర్ తన సిబ్బందితో వారికి ఆహ్వానం పలికారు. ఆలయ అర్చకులు అమ్మవారికి, స్వామివారికి విశేష పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో శశికళ, అరుణకుమారి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు కావాలా ?



అయితే..చెయ్యి తడపాల్సిందే..!

విచారణ పేరుతో డబ్బులు డిమాండ్

భీమవరం క్రైం, జూలై 11 : ఎవరైనా ఇతర దేశాలకు టూర్‌లు వెళ్లాలన్నా, ఉపాధి, ఉద్యోగం, చదువు నిమిత్తం విదేశాలకు వెళ్లాలన్నా తప్పనిసరిగా పాస్‌పోర్టు అవసరం. అనంతరం వీసా కావాలి. అయితే వీసా కంటే ముందు పాస్‌పోర్టు కోసం నానా ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా పేదలు, మధ్యతరగతి వారు ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లేందుకు సంబంధిత పాస్‌పోర్టు కార్యాలయంలో పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకుంటారు. అది ఆన్‌లైన్ అయిన తరువాత సంబంధిత వ్యక్తి ఇచ్చిన చిరునామాలో ఉన్నారా ? వారిపై ఏమైనా క్రిమినల్ కేసులు ఉన్నాయా? అని విచారణ చేయవలసి ఉంటుంది. దాని కోసం పోలీస్ శాఖ నుంచి ఒక ఏరియాకు ఒక అధికారిని నియమిస్తారు. దరఖాస్తుదారుడికి అడ్రస్, కేసుల గురించి ఎంక్వయిరీ చేసి పైఅధికారులకు నివేదిక పంపిస్తారు. అయితే కొందరు అధికారులు ఎంక్వయిరీ కోసం వచ్చినప్పుడు రూ.500 నుంచి రూ. వెయ్యి వరకు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు కొందరు దరఖాస్తుదారులు చెబుతున్నారు. అన్ని సక్రమంగా ఉన్నా కూడా ప్రభుత్వం నుంచి లక్షల్లో జీతాలు వస్తున్నప్పటికీ పెట్రోల్ ఖర్చులు, సాధారణ ఖర్చులు పేరుతో కొందరు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని చెబుతున్నారు. అలా డబ్బు ఇవ్వని పక్షంలో పాల్స్ అడ్రస్ అనిగాని, హౌస్ లాక్ అని గాని నివేదికలో రాసి పంపిస్తామని బెదిరిస్తున్నారని చెబుతున్నారు. ఇలా చెయ్యడం వల్ల పేద, మధ్య తరగతి కుటుంబాలు వారు పాస్‌పోర్టు కోసం ఇబ్బందులు పడుతున్నారు. దానికి తోడు వీసా ఇప్పిస్తామంటూ కొందరు ఏజెంట్లు మోసం చెయ్యడంతో చాలా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

ఇప్పటి వరకు అలాంటి ఫిర్యాదులు ఏమీ అందలేదు. డబ్బులు డిమాండ్ చేసి ఎవరైనా ఇబ్బంది పెడితే నా దృష్టికి తీసుకు వస్తే వెంటనే తగు చర్యలు తీసుకుంటాం.

-తిలక్, స్పెషల్ బ్రాంచ్ సీఐ, పశ్చిమ గోదావరి జిల్లా



మెరిట్ జాబితా విడుదల చేసిన ట్రిపుల్ ఐటీ అధికారులు

ట్రిపుల్ ఐటీ మెరిట్ జాబితా విడుదల

67.15 శాతం బాలికలు ఎంపిక

నూజివీడు, జూలై 11: ఆర్జీయూకేటీలో 2024-25 విద్యాసంవత్సర ప్రవేశానికి క్యాంపస్‌ల వారీగా ఎంపికైన విద్యార్థుల తుది జాబితాను గురు వారం ఏలూరు జిల్లా నూజివీడు ఆర్జీయూకేటీ ఛాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి, నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో విడుదల చేశారు. ఈ ఏడాది 53,863 మంది ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు క్యాంపస్‌లలో ఒక్కో క్యాంపస్‌లో వెయ్యిసీట్లతో పాటు ఈడబ్ల్యూఎస్ కోటా కింద అదనంగా 100 సీట్లతో నాలుగు క్యాంపస్‌లకు మొత్తం 4,400 మంది విద్యార్థులతో భర్తీ చేస్తారు. వీరిలో 85 శాతం ఏపీ విద్యార్థులు ఉంటే 15శాతం ఓపెన్ మెరిట్ కోటాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర అభ్యర్థులకు కేటాయిస్తారు. ఈ ఏడాది ఎంపిక కాబడిన విద్యార్థుల జాబితా ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు 92.99 శాతం మంది, ప్రైవేట్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు 7.01శాతం ఉంది. ఎంపికైన విద్యార్థుల్లో 67.15 శాతం బాలికలు, 32.85 శాతం మంది బాలురు ఉన్నారు. ఎంపిక కాబడిన విద్యార్థులు నూజివీడు ప్రాంగణంలో ఈనెల 22,23వ తేదీల్లో, ఆర్కేవ్యాలీ (ఇడుపులపాయ) ఎంపిక కాబడిన విద్యార్థులకు 22,23 తేదీల్లో ఇడుపులపాయ క్యాంపస్‌లోనూ, ఒంగోలు ట్రిపుల్‌ఐటీకి ఎంపిక కాబడిన విద్యార్థులకు ఈనెల 24,25 తేదీల్లో ఇడుపులపాయ ప్రాంగణంలో, శ్రీకాకుళం ప్రాంగణానికి ఎంపికైన విద్యార్థులకు ఈనెల 26,27 తేదీల్లో కౌన్సిలింగ్ నిర్వహిస్తాని అధికారులు తెలిపారు. ఎంపికైన విద్యార్థుల వివరాలు ఆర్జీయూకేటీ వెబ్‌సైట్ www.rgukt.inIZ పెట్టామన్నారు. దరఖాస్తులో తెలిపిన ఫోన్ నంబర్లకు మెసేజ్, ఎస్ఎంఎస్ ద్వారా వివరాలు తెలిపామన్నారు. ఏ విద్యార్థి ఏ క్యాంపస్‌కు కౌన్సెలింగ్‌కు వెళ్లాలో కౌన్సెలింగ్‌కు తీసుకెళ్లాల్సిన సర్టిఫికెట్ల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చామని అడ్మిషన్స్ కన్వీనర్ ఆచార్య అమరేంద్రకుమార్ తెలిపారు.

ద్వారకాతిరుమలలో అన్న,చెల్లెలకు..



ద్వారకాతిరుమల, జూలై 11:ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం కె.లీలాకుమార్ తెలిపారు. పదవ తరగతిలో 600కు 574 మార్కులు తెచ్చుకున్న రాచూరి కృష్ణతేజకు, అలాగే 600కు 573 మార్కులు తెచ్చుకున్న రాచూరి కృష్ణ చైతన్యకు సీట్లు వచ్చినట్లు వివరించారు. ఐఐటీ ప్రవేశాలకు విడుదలైన మెరిట్ లిస్ట్‌లో వీరి పేర్లు ఉండటంతో గ్రామంలో ఆనందం వెల్లివిరిసింది. విద్యార్థులను గ్రామ పెద్దలు, తల్లితండ్రుల కమిటీ సభ్యులు అభినందించారు.

ఇద్దరు గురుకుల విద్యార్థులకు..



తాడేపల్లిగూడెం రూరల్ :తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లికి చెందిన డాక్టర్ బీఆర్ అంబే ద్కర్ గురుకులం విద్యార్థులు బుర్రే ప్రకాష్ (పదో తరగతిలో మార్కులు 577). టేకు కుమార్ సత్యసాయిశ్రీ (575) ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజారావు గురువారం తెలి పారు. ప్రకాష్ నూజివీడు ట్రిపుల్ ఐటీలో, కుమార్‌కు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీట్లు లభించినట్లు వివరించారు. విద్యార్థులను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, డీసీవో భారతి, ఎంఈవో హనుమ అభినందించారు.

వామనమూర్తిగా జగన్నాథుడు



ద్వారకాతిరుమల, జూలై 11: వామనమూర్తిగా జగన్నాథుడు గురువారం భక్తజనులకు దర్శనమి చ్చారు. ఒక చేతిలో గొడుగు, మరో చేతిలో కమండలం, పాత్రను ధరించి బలిచక్రవర్తిని పాతాళంలోకి తొక్కి వేస్తున్నట్లున్న అలంకరణ భక్తులకు కనువిందు చేసింది. లక్ష్మీపురం ఆలయంలో ఈనెల 7న ప్రారంభ మైన జగన్నాథ రథోత్సవాలను పురస్కరించుకుని ఆలయ మండ పంలో ఏర్పాటు చేసిన ఈ అలంకారాలు భక్తులను అలరిస్తున్నాయి.

పెరిగిన గోదావరి నీటిమట్టం



పోలవరం, జూలై 11 : పోలవరంలో గోదావరి నీటిమట్టం గురువారం సాయంత్రానికి పెరిగింది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉపనదులు శబరి, ఇంద్రావతి, సీలేరు, కిన్నెరసాని, మానేరు, ప్రాణహిత, మంజీర, పూర్ణప్రవర నదుల నుంచి వరద జలాలు ప్రవహిస్తున్న నేపథ్యంలో గోదావరిలో నీటిమట్టం రెండు రోజులుగా క్రమ క్రమంగా పెరుగుతోంది.స్పిల్వేలోకి వస్తున్న గోదావరి జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేయడం వల్ల స్పిల్వేలో సాధారణ నీటిమట్టం మాత్రమే నమోదైంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 26.900 మీటర్లు, స్పిల్వే దిగువన 17.000 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యాంకి ఎగువన 26.980 మీటర్లు, దిగువ కాఫర్ డ్యాంకి దిగువన 15.980 మీటర్లు నమోదయినట్లు ఈఈలు వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.

పట్టిసీమ నుంచి 6,726 వేల క్యూసెక్కుల నీరు విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి బుధవారం 6,372 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు ఎత్తి పోతల పథకం డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 15.249 మీటర్లకు చేరుకుందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 19 పంపులు 19 మోటార్లతో నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

ఆక్వా మందుల దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు



లోకుముడిలో ఆక్వాషాపులను తనిఖీ చేస్తున్న బృందం సభ్యులు

మండవల్లి జూలై 11 : మండవల్లి మండలంలోని పలు ఆక్వా మందుల దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. పెరుగుతున్న కల్తీలను నివారించేందుకు రైతులకు నాణ్యమైన మందులను అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం మత్స్యశాఖ, రెవెన్యూ డ్రగ్‌పుడ్, పోలీసు, ఎంపీడీవో అధికారులతో ఒక టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేసిందని కైకలూరు మత్స్యశాఖ ఏడీ చాంద్‌బా షా తెలిపారు. లోకుముడిలోని నాలుగు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించగా ఎటువంటి నిషేధిత మందులు దొరకలేదని తెలిపారు. రైతుల ఉన్నతి కోసం ప్రభుత్వం పాటుపడుతుందని అందులో భాగంగా నాణ్యమైన విత్తనాలు, మందులు, మేతలు అందించేందుకు కృషి చేస్తుందన్నారు. ఇటీవల ఆక్వాసాగులో యాంటీబయోటిక్స్ ఎక్కువగా వినియోగించడం వల్ల ఇతర దేశాలకు ఎగుమతి అవుతున్న మన రొయ్యల్లో యాంటీబయోటిక్స్ అవశేషాలు ఉండడంతో వాటిని వెనుకకు పంపుతున్నారని తెలిపారు. ఆక్వా దుకాణ దారులు యాంటీబయోటిక్స్ అమ్ముతూ మొదటిసారి పట్టుబడితే రూ.25 వేలు, రెండోసారి పట్టుబడితే రూ.50వేలు జరిమానా విధిస్తామని మూడోసారి లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. డ్రగ్ అధికారి జీవని, పెంపెడా అధికారి అమర్నాథ్. వీఆర్వో యువరాజ్ ఉన్నారు.

బైక్‌లు ఢీ..ఇద్దరికి గాయాలు

బుట్టాయగూడెం, జూలై 11: బుట్టాయగూడెం-కన్నాపురం రోడ్డులోని కంసాలికుంట సమీపంలో గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. బుట్టాయగూడెం నుంచి కన్నాపురం వైపుగా వెళుతున్న స్థానిక ఎలక్ట్రికల్ ఏఈ ఎన్.శ్రీనివాస వర్మ, రాచూరు నుంచి బుట్టాయగూడెం వైపుగా వస్తున్న వెట్టి సందురాజులు ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలపై కంసాలికుంట సమీపంలో ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలవగా 108లో స్థానిక సీహెచ్‌సికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. ఏఈకి బుట్టాయగూడెంలోనే వైద్యం అందించగా మెరుగైన వైద్యం కోసం సింధురాజును జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ తెలిపారు.

పాలకొల్లులో గుర్తు తెలియని వ్యక్తి మృతి



పాలకొల్లు అర్బన్, జూలై 11 : పాలకొల్లు న్యూక్లాత్ మార్కెట్ వద్ద ఒక బట్టల షాపు సమీపంలో బుధవారం ఉదయం గుర్తు తెలియని మృత దేహాన్ని స్థానికులు గుర్తించారు. పట్టణ పోలీసులు మృత దేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆచూకీ తెలిసినవారు 94407 96668, 08814- 222333 నంబర్లకు సమాచారం అందజేయాలని పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

కొయ్యలగూడెం, జూలై 11 :కొయ్యలగూడెంలో వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. పట్టణంలోని ఎస్సీపేటకు చెందిన ఉందుర్తి తనూజ (25) బుధవారం రాత్రి ఉరి వేసుకుని మృతి చెందిందని మృతిరాలి భర్త అనిల్ కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. మృతురాలి తండ్రి బాబురావు తన కుమార్తె మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, జూలై 11 : వేగంగా వెళ్తున్న రైలు నుంచి జారిపడి ఒక గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే స్టేషన్ పరిధిలోని తేల్లపోలు రైల్వే గేటు సమీపంలో సుమారు 20 నుంచి 30 ఏళ్ల వయసు కల్గిన యువకుని మృత దేహం ఉన్నట్లు ఏలూరు రైల్వే పోలీసులకు గురువారం ఉదయం సమాచారం అందింది. దీంతో రైల్వే ఎస్ఐ నరసింహారావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లారు. మృతుడు 5.6 అడుగుల ఎత్తు కల్గి, నీలం రంగు పొట్టి చేతుల టీషర్టు, నీలం రంగు జీన్‌ప్యాంటు ధరించి ఉన్నాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఎస్ఐ సెల్ నెంబర్ 95020 97672కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

మహిళ అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, జూలై 11 : కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక మహిళ గట్టిగా కేకలు వేస్తూ ఆకస్మాత్తుగా కిందపడిపోవడంతో ఆమెను ఆసుపత్రికి

క్రైం కార్నర్

తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. ఏలూరు త్రిటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు సమీపంలోని వట్లూరుకు చెందిన కట్టా రంగమ్మ (51) బుధవారం రాత్రి ఇంట్లో కుటుంబ కలహాలు జరిగాయి. ఆమె కుమారులు మధ్య వివాదాలు ఉండడంతో ఆమె తన కుమారుడిని గట్టిగా మందలించారు.ఈ నేపథ్యంలో ఆమె ఆకస్మాత్తుగా ఆమె కిందపడిపోయారు. వెంటనే ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు.ఆమె కుమారుడు కట్టా నాగరాజు ఈ సంఘటనపై ఏలూరు త్రి టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు మృత దేహాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. గురువారం ఉదయం పంచనామా నిర్వహించి పోస్టుమార్టం జరిపి బంధువులకు అప్పగించారు. ఆమె గుండె పోటు వల్ల మరణించినట్లుగా ప్రాథమికంగా నిర్ధారించారు.

విద్యుదాఘాతానికి కూలీ మృతి

ఆకివీడు, జూలై 11: కరెంటు షాక్ కొట్టి కూలీ మృతి చెందాడు. తరటావకు చెందిన యాళ్ల రమేష్ (32) గురువారం చెరువుపై గడ్డి కోయడానికి వెళ్లాడు.గడ్డి కోస్తుండగా మోటారు వైర్ మీద కాలు వేయడంతో షాక్ కొట్టగా అక్కడకక్కడే మృతి చెందాడు. రమేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఉషారాణి ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు.

చికిత్స పొందుతూ జట్టు కూలీ మృతి

పెంటపాడు, జూలై 11 : బస్తాల మేటుపై నుంచి జారిపడి చికిత్స పొందుతూ జట్టు కూలీ మృతి చెందాడు. మండలంలోని రాచర్ల గ్రామానికి చెందిన జమ్ము శ్రీనివాస్ అలంపురం ఎంసీ వినాయక రూరల్ గొడౌన్‌లో జట్టు కూలీగా పనిచేస్తున్నాడు. గత నెల 18న లారీ లోకి తౌడు బస్తాలు లోడింగ్ చేస్తున్న క్రమంలో బస్తాల మేటుపై ఉన్న శ్రీనివాస్ ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలైన అతడిని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.చికిత్స పొందుతూ శ్రీనివాస్ బుధవారం రాత్రి మృతి చెందాడని, మృతుని భార్య ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శీలం శంకర్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

టి.నరసాపురం, జూలై 11: కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టి.నరసాపురం పంచాయతీలోని ముత్యాలమ్మపేటకు చెందిన తాతా కాశీ విశ్వనాథం కడుపు నొప్పి తాళలేక ఈ నెల 8న పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు విజయవాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని కుమారుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్.ఐ.డి దుర్గా మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్థలం సరిహద్దు తగాదా..కేసు నమోదు

ఉండి, జూలై 11: స్థలం సరిహద్దు విషయంలో వ్యక్తిపై దాడిచేసి గాయపరిచిన సంఘటనలో కేసు నమోదు చేసినట్లు ఉండి ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. తన స్థలానికి సంబం ధించి సరిహద్దు దారుడు బొబ్బాది సత్యనారాయణ అతని కుటుంబసభ్యులు ఈనెల 9న తనతో గొడవ పడ్డారని కొట్టి గాయపరిచారని ఉండి గ్రామానికి చెందిన వెన్ని సాయివినోద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం



భీమడోలు, జూలై 11 : అక్రమంగా ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని భీమడోలు పోలీసులు పట్టుకున్నారు. తణుకు నుంచి కురెళ్ళగూడెం వైపు రేషన్ బియ్యంతో వెళుతున్న ఆటోను అడ్డుకున్నారు. ఉంగ్రాజవరం గ్రామానికి చెందిన కె.మణికంఠ ఆటోలో ఈ బియ్యాన్ని తరలిస్తున్నట్లు వచ్చిన సమా చారం పోలీసులు కురె ళ్ళగూడెంలో ఆటోను అడ్డుకుని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం విలువ లక్షా 42 వేల 800 రూపాయలు ఉంటాయని సీఎస్ డీటీ మాధవరావు తెలిపారు. నిందితుడిపై 6ఎ కేసు నమోదు చేసి బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ సుధాకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



హోటల్స్‌లో తనిఖీలు చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

పాచిపోయిన చికెన్..విషం చిమ్మే ఆయిల్

హోటల్స్, రెస్టారెంట్లలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 11: తాడేపల్లిగూడెంలో హోటల్స్ రెస్టారెంట్ల నిర్వహణ తీరు అధ్వానంగా ఉంది. కొంతమంది ప్రజల ప్రాణాలతో ఆటలాడుకుంటున్నారు. పాచి పోయిన చికెన్, రోజుల తరబడి ఉపయోగించిన ఆయిల్, ఫుడ్ కలర్స్, బ్యాన్ చేసిన టేస్టీ సాల్ట్ విపరీతంగా వాడుతున్నారు. గురువారం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సుందర రామిరెడ్డి పట్టణంలో పలు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లు, హోటల్స్‌లో తనిఖీలు నిర్వహించగా ఇలాంటివే బయటపడ్డాయి. ఫ్రిడ్జ్‌లో రోజుల తరబడిన దాచిన చికెన్, వండి వార్చిన బిర్యానిలు కనిపించాయి. వాటితో పాటు రోజుల తరబడి ఉపయోగించిన ఆయిల్స్ వాడుతున్నట్టు గుర్తించారు. దీనిపై సుందర రామిరెడ్డి సాంపిల్స్ సేకరించి ల్యాబ్ పరీక్షల కోసం తరలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో 8 రెస్టారెంట్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లలో తనిఖీలు నిర్వహించి అందరికీ నోటీసులు జారీ చేశామని ఎవరికీ ఫుడ్ లైసెన్స్ లేదని వివరించారు. వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో ఉన్న మరిన్ని రెస్టారెంట్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లలో తనిఖీలు నిర్వహిస్తామని ఎవరూ ప్రజల ప్రాణాలతో వ్యాపారం చేయవద్దని సూచించారు.

చోరీల్లో వారు ఎక్స్‌పర్ట్స్

అంతర రాష్ట్రాల ముఠా సంచారం

అనాథలకు చందాల పేరుతో రెక్కీ



భీమవరం బంగారు దుకాణాల ఏరియాలో తిరుగుతున్న ఇతర రాష్ట్రాల మహిళలు

భీమవరం క్రైం, జూలై 11 : వారంతా ఒకటే ముఠా.. కలిసికట్టుగా వస్తారు. షాపులు, నివాసాలు వద్ద అనాథలకు సాయం చెయ్యండి .. అంటూ చందాలు అడుగుతారు. వారికి ఏమైనా విలువైనవి కనిపించాయా వాటిని చోరీ చెయ్యడంలో చాలా చేయితిరిగిన వారు. జిల్లాలోని ప్రధాన పట్టణాలైన భీమవరంతో పాటు నర్సాపురం, తణుకు, తాడేపల్లిగూడెం వంటి ప్రాంతాల్లో ఇలాంటి ముఠా సంచరిస్తోంది. జీన్స్ ప్యాంట్స్, టీషర్ట్, మంచి మంచి చీరలు ధరించి చేతిలో పుస్తకాలు పట్టుకుని తిరుగుతూ అందినకాడికి దోచుకుంటున్నారు. బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి ప్రాంతాల నుంచి కొంతమంది ఈ ప్రాంతాలకు వస్తుంటారు. ప్రతీ ఏడాది ఒక నెలపాటు ఈ ప్రాంతాల్లో తిరుగుతూ ఉంటారు. అయితే వారితో పాటుగా పురుషులు కూడా వస్తున్నట్లు చెబుతున్నారు. ముందుగా మహిళలు రెక్కీ నిర్వహించి అనువైన ప్రాంతాల్ని పురుషులకు తెలియపర్చుతారని కొందరు పోలీసు అధికారులు చెబుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారిపై పోలీసులు నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థిపై కొండముచ్చు దాడి.. స్వల్ప గాయాలు



జంగారెడ్డిగూడెం, జూలై 11 : జంగారెడ్డిగూడం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న తెల్లం వంశీ అనే బాలు డిపై గురువారం కొండముచ్చు దాడి చేసింది. బాలుడి చేతికి గాయం అవడంతో పాఠశాల హెచ్ఎం లోవకుమారి స్థానిక ఏరియా ఆసుపత్రికి పంపి ప్రథమ చికిత్స అందించారు. ఆమె మాట్లాడుతూ కొంతకాలంగా కొండ ముచ్చు తమ పాఠశాలలో సంచరిస్తోందని ఎవరికీ ఎటువంటి హాని చేయదని అన్నారు. అయితే రెండు రోజుల క్రితం కొండముచ్చు చేతికి గాయమైందని అప్పటినుండి పిచ్చిగా ప్రవర్తిస్తోందన్నారు. విద్యార్థిపై దాడి చేసిన వెంటనే జిల్లా వైల్డ్‌లైఫ్ అధికారులకు ఫిర్యాదు చేశామని కొండ ముచ్చును పట్టి అడవిలో వదిలి పెడతామని చెప్పారని తెలిపారు.

కొడుకు స్నేహితుడని ఆశ్రయం ఇస్తే.. బంగారం కొట్టేశాడు

ఏలూరు క్రైం, జూలై 11 : కుమారుడి స్నేహితుడని ఆశ్రయం ఇస్తే ఇంటిలో ఉన్న బంగారాన్ని అపహరించుకుని పోయిన ఓ యువకునిపై గురువారం రాత్రి కేసు నమోదైంది. ఏలూరు కొత్తపేటకు చెందిన మల్లెపురెడ్డి మోహనరావు కుమారుడికి కైకరానికి చెందిన గణపవరపు తేజ స్నేహితుడు. ప్రస్తుతం తేజ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఏలూరులో పని ఉందంటూ ఇటీవల ఏలూరు వచ్చాడు. నాలుగు ఇక్కడే ఉండాలని హోటల్ రూములో ఉండడానికి తన వద్ద అంత సొమ్ము లేదని మీ ఇంట్లో ఉంటానని తన స్నేహితుడిని కోరడంతో ఆ విషయాన్ని తన తండ్రి మోహనరావుకు చెప్పడంతో ఆయన అంగీకరించి ఆశ్రయం కల్పించారు. ఆ ఇంట్లో ఉన్న సుమారు నాలుగు లక్షల రూపాయల విలువైన బంగారు ఆభరణాలను తేజ తాడేపల్లిగూడెం తీసుకువెళ్లి ఒక గోల్డ్ షాపులో తాకట్టుపెట్టాడు. అయితే అతనితో పాటు మోహనరావు కుమారుడిని కూడా జతకు తీసుకువెళ్లి షాపు బయటే నిలబెట్టాడు. తేజ వెళ్లిపోయిన తరువాత ఇంట్లో బంగారం కనిపించలేదు. గూడెం నగల దుకాణానికి వెళ్లినట్టు కుమారుడు చెప్పడంతో వెంటనే తాడేపల్లిగూడెం వెళ్ళి గోల్డ్‌షాపులో విచారించగా మూడు లక్షల 90 వేల రూపాయలకు తాకట్టు పెట్టాడని చెప్పడంతో మోహనరావు ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



ఆచంట, జూలై 11: ఆచంటలో సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో పి. నరసింహ ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది హాజరు పట్టీని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బంది తమకు కేటాయించిన సమయంలో తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ మూర్తి బాబు, కార్యదర్శి నాగబాబు ఉన్నారు.

వల్లూరు డ్రెయిన్ ప్రక్షాళన పనులు



తూడు నివారణకు రసాయనాలు స్ప్రే చేస్తున్న దృశ్యం

యలమంచిలి, జూలై 11: గుంపర్రు గ్రామంలో వల్లూరు డ్రెయిన్‌లో తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులను ఎన్డీఏ నాయకులు గురువారం ప్రారంభించారు. ఈ డ్రెయిన్ కొడమంచిలి గ్రామం నుంచి మొదలై కోడేరు, కరుగోరుమిల్లి, కందరవల్లి, వల్లూరు, గుంపర్రు, బూరుగుపల్లి, ఇలపకుర్రు గ్రామాల మీదుగా సుమరు 20 కిలోమీటర్ల మేర ప్రవహించి కట్టుకాలువ వద్ద నక్కల డ్రెయిన్‌లో కలుస్తుంది. డ్రెయిన్‌లో దట్టంగా గుర్రపుడెక్క, తూడు పెరిగిపోయి మురుగునీరు పారక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి సమస్యలు రైతులు తెలిపారు. దీంతో మంత్రి ఆదేశాలతో అధికారులు తూడు తొలగింపు పనులు చేపట్టారు. వల్లూరు, తాడేరు డ్రెయిన్‌ల ప్రక్షాళనకు రూ.22లక్షలు మంజూరు అయ్యాయని డ్రెయిన్స్ ఏఈ దుర్గారావు తెలిపారు. కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు బోనం నాని, మామిడిశెట్టి పెద్దిరాజు, బొప్పన హరికిషోర్, మాతా రత్నంరాజు, ఆరుమిల్లి చిన్ని, తాళ్లూరి సత్యశ్రీనివాస్, చిట్టూరి ఆంజనేయులు, పీతల శ్రీను పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి, జూలై 11: యలమంచిలి, ఇలపకుర్రు, కాజ విద్యుత్తు సబ్‌స్టేషన్లలో విద్యుత్ మరమ్మతులు కారణంగా సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ డి.రాజీవ్ తెలిపారు.

నరసాపురం టౌన్: తూర్పుతాళ్ళు, పీఎంలంక, వేములదీవి, బియ్యపుతిప్ప,చినలంక, పసలదీవి, ఎల్‌బిచర్ల, కేపీపాలెం, మోడీ గ్రామాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 4గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

పెంటపాడు: పెంటపాడు, ముదునూరు, ఆకుతీగపాడు, కె.పెంటపాడు, యానాలపల్లి, పరిమెళ్ళ, పడమరవిప్పర్రు గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కరెంట్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ శాఖ డీఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు.

తణుకు: తణుకులోని బ్యాంకు కాలనీ, సూర్యాలయం వీధి, వేల్పూరురోడ్, వీరనారాయణ టాకీస్, నరేంద్ర సెంటర్, తణుకు పట్టణంలో కొమ్మాయి చెర్వుగట్టు, పాతూరు. ఇరగవరం కాలనీ, కొమరవరం రోడ్డు, జపాన్ కాలనీ, రూరల్ మండలంలో వేల్పూరు, లక్ష్మీ గణేష్ నగర్, ఇరగవరం మండలంలోని అన్ని గ్రామాలు, అత్తిలి మండలంలో అత్తిలి, లక్ష్మీనగర్, రిలయన్స్ ఏరియా, ఉరదాళ్ళపాలెం, పాలూరు గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ నిలుపుదల చేస్తామని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ రామకృష్ణ తెలిపారు.

పెనుమంట్ర: జుత్తిగ, నత్తా రామేశ్వరం, మల్లిపూడి, సోమరాజు ఇల్లిందాలపర్రు, పెనుమంట్ర గరువు, పెనుమంట్ర గ్రామాలకు శుక్రవారం ఉదయం8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ బిసురేష్ కుమార్ తెలిపారు.

తాడేపల్లిగూడెం రూరల్: సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆరుగొలను, కృష్ణాయపాలెం, కొత్తూరు, నవాబుపాలెం, ఆరుళ్ల, మారంపల్లి, నందమూరు గ్రామాల్లో కరెంట్ ఉండదని ఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు.

పాలకొల్లు రూరల్: పట్టణంలోని బస్టాండ్ ఏరియా, శ్రీరామ్‌పేట, మావుళ్ళమ్మపేట, కెనాల్ రోడ్డు, కోడిగట్టు, మార్కు పేట, రామయ్య హాలు, యాళ్ళవాని గరువు, బ్రాడీపేట, బైపాస్ రోడ్డు, పెనుమదం రోడ్డు, లక్ష్మీనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎఈఈ సురేష్ కుమార్ తెలిపారు.

జీతం బకాయిలు చెల్లించాలని ఆందోళన



ఆచంట, జూలై 11: సమగ్ర శిక్ష ప్రాజెక్టులలో పని చేస్తున్న ఉద్యోగులకు సంబంధించి మే, జూన్ నెలల పెండింగ్ వేతనాలను అలాగే ఇటీవల సమ్మె చేసిన కాలానికి సంబంధించి బకాయిలు కూడా తక్షణం చెల్లించాలని కోరుతూ గురువారం స్థానిక సమగ్ర శిక్ష కార్యాలయం వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్లకార్డులతో ఆందోళన నిర్వహించారు. చాలీ చాలని జీతాలతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నామని అలాంటప్పుడు జీతాలు పెండింగ్‌లో ఉంచితే అనేక ఇబ్బందులు పడతామని పేర్కొన్నారు.

వ్యాధులపై మహిళలకు అవగాహన

పెనుగొండ, జూలై 11: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎం. విజయ కుమారి అన్నారు. పెనుగొండ వెలమ కమ్యూనిటీ హాలులో వ్యాధులపై 100 రోజుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు తమ పిల్లలను బాగా చదివించాలన్నారు. తమ చుట్టు ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీజనల్‌గా వచ్చే వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం డయేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

అనాథ మృతదేహానికి అంతిమ సంస్కారం

భీమవరం అర్బన్, జూలై 11: అనాథ వృద్ధురాలి మృతదేహానికి మానత సేవా సంస్థ భీమవరం శాఖ ఆధ్వర్యంలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పూనా రామం, కార్యదర్శి వేమురి రాంబాబు, సభ్యులు బుద్దరాజు వెంకటపతిరాజు, కార్మూరి నరసింహమూర్తి, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల చిత్రపటాల అందజేత

భీమవరం టౌన్, జూలై 11 : భీమవరం రెండో పట్టణంలోని 34,35 వార్డులోని సచివాలయంకు యాస అనిల్, కొప్పినిడి బాబీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు చిత్రపటాలను అందించారు. ఏఎంసీ మాజీ చైర్మన్లు కోళ్ల నాగేశ్వరరావు, ఇందుకూరి రామలింగరాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ ముదునూరి సూర్యనారాయణ రాజు, జడ్పీటీసీ గుండా జయప్రకాష్ నాయుడు, జనసేన రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి ఉండపల్లి రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వద్దంటూ ఆందోళన



భీమవరంలో సీపీఎం నాయకుల ఆందోళన

భీమవరం అర్బన్, జూలై 11: సీపీఎం ఆధ్వర్యంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరించ వద్దంటూ బైపాస్ రోడ్డు లో ఆందోళన నిర్వహిం చారు. కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమార స్వామి, సహాయమంత్రి శ్రీనివాసవర్మతో కలసి విశాక స్టీల్ ప్లాంటును సందర్శించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి బలరాం అన్నా రు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు తమ వైఖరిని ప్రజలకు స్పష్టం చేయలని కోరారు.

తణుకు/ఆకివీడు: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక వెంకటేశ్వర థియేటర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. పార్టీ నాయకులు పీవీ ప్రతాప్, గార రంగారావు, కామన మునిస్వామి, బళ్ళ చినవీరభద్రరావు, రాజా పాల్గొన్నారు. ఆకివీడులో కేతా గోపాలన్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు

జగన్‌ను కలసిన వైసీపీ నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 11: వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లిగూడెం వైసీపీ నాయకులు కలిశారు. ఏపీ అప్కాడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాంనాయుడు, జడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు తదితరులు ఆయనను కలిసి పార్టీ పరిస్థితులు వివరించారు. ఈ సందర్భంగా జగన్ ఓటమికి బెదరవద్దని త్వరలోనే ప్రజల్లోకి వస్తానని చెప్పినట్టు నాయకులు వివరించారు.









నరసాపురంలో సబ్సిడీ దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయకర్.. పాలకొల్లులో సరుకులు అందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ అంగర.. తాడేపల్లిగూడెంలో ఎమ్మెల్యే బొలిశెట్టి, వలవల, తాతాజీ.. తణుకులో ఎమ్మెల్యే ఆరిమిల్లి

సబ్సిడీపై బియ్యం, కందిపప్పు

జిల్లాలో పలుచోట్ల విక్రయ షాపులు ప్రారంభించిన ఎమ్మెల్యేలు

నరసాపురం టౌన్, జూలై 11: ప్రజల సమస్యల్ని ఎప్పటికప్పుడు తెలుసుకుని వారికి అండగా ఉంటూ పాలన సాగిస్తామని ఎమ్మెల్యే నాయకర్ అన్నారు. గురువారం రైతు బజార్‌లో సబ్సిడీ బియ్యం, కందిపప్పు దుకాణాన్ని ఆర్డీవో అంబరీష్, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజులతో కలిసి ఎమ్మెల్యే నాయకర్ ప్రారంభించారు. తహసీల్దార్ ప్రసాద్, డీటీ నాగదేవి, కొప్పాడ రవి, జక్కం శ్రీమన్నారాయణ, వాతాడి ఉమా, అధికారి అనంత రామారావు, సంకు భాస్కర్, పాలూరి బాబ్జీ పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్: రైతు బజారులో ఏర్పాటు చేసిన షాపును మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ ప్రారంభించారు. ప్రస్తుతం బియ్యం, కందిపప్పు అందుబాటులో ఉన్నాయని, త్వరలో మిగిలిన సరుకులు కూడా అందుబాటులో ఉంచడం జరుగుతుందని సీఎస్‌డీటీ సత్యానారాయణ తెలిపారు. ఆధార్ కార్డుమీద కిలో కందిపప్పు, 5కిలోల బియ్యం అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు జీవీ, రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు, ఉన్నమట్ల కపర్థి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: పట్టణంలోని చాంబర్ ఆఫ్ కామర్స్‌లో తక్కువ ధరలకే అమ్మకాలు జరుపుతున్న బియ్యం, కందిపప్పు షాపును ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ ప్రారంభించారు.

తణుకు: ఆర్యవైశ్య కల్యాణ మండపం సమీపంలో నిత్యావసరాల స్టాల్‌ను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రారంభించారు. స్టాల్‌లో దేశవాళీ కందిపప్పు కిలో 160, స్టీమ్డ్ బీపీటీ బియ్యం కిలో.49కు విక్రయిస్తారని చెప్పారు. అనంతరం కందిపప్పు, బియ్యాన్ని కొనుగోలుదారులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ దొమ్మేటి వెంకటసుధాకర్, బసవార రామకృష్ణ, కలగరవెంకట కృష్ణ, తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావు, చాంబర్ నాయకులు పర్మిష్ట వీరన్న, చింతలపూడి సన్యాసిరావు, శ్రీను, తాతపుడి మారుతీరావు పాల్గొన్నారు.



భీమవరంలో సరుకులు అందిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్: భీమవరం రైతు బజార్‌లో సబ్సిడీపై బియ్యం, కందిపప్పు అందించే కౌంటర్‌ను ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. కేంద్రం వద్ద ప్రజలకు రేట్లు తెలిసే విధంగా బోర్డు ను ఏర్పాటు చెయ్యాలని ఆదేశించారు. ఆర్డీవో శ్రీనివాసుల రాజు పాల్గొన్నారు.

పాఠశాలల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు

ఉండి జూలై 11:పాఠశాలల అభ్యు న్నతికి ప్రత్యేకంగా పాటుపడతానని ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. గురువారం ఎన్ఆర్‌పీ అగ్రహారం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎంవీ సత్యనారాయణ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ విద్యతో పాటు ఆటలలో కూడా రాణించాలంటే విద్యార్థులకు అవసరమైన మౌళిక వసతులను సమకూర్చవలసి వుందన్నారు. దాతల సహకారంతో వాటిని ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. పూర్వపు విద్యార్థి కల్లేపల్లి సతీష్‌రాజు అందించిన మొక్కలను, స్పోర్టుకిట్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో నియోజవర్గ జనసేన ఇన్‌చార్జు జుత్తుగ నాగరాజు, గ్రామ టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు రామేశ్వరపు దుర్గారావు, ముగ్గళ్ల సత్తిబాబు, మండల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు కరిమెరక నాగరాజు, కిన్నెర వెంకన్న, ఎంపీపీ ఇదుకూరి హరిబాబు, జడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ, సర్పంచ్ సూరవరపు కనకదుర్గ పాల్గొన్నారు. ఎన్ఆర్‌పిఅగ్రహారంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సబ్‌సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.

తోట సీతారామలక్ష్మికి వినతి అందజేత



తోట సీతారామలక్ష్మికి వినతి పత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు

భీమవరం అర్బన్, జూలై 11: కృష్ణబలిజ-పూసల ఫైనా న్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించాలని కృష్ణబలిజ సాధికార సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, బీసీ సాధికారత కమిటీ డైరెక్టర్ గంటా త్రిమూర్తులు గురువారం టీడీపీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మిని కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంటా నాగలక్ష్మి, ఎండీ నౌషద్, మద్దుల రాము, పామర్తి వెంకట రామయ్య పాల్గొన్నారు.

వెదజల్లే పద్ధతిలో సాగు చేయండి

మొగల్తూరు, జూలై 11: సార్వా సాగుకు ఆకుమడులు సిద్ధం చేసుకోని రైతులు వెదజల్లే పద్ధతిని పాటించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు ఈ.అనిల్ కుమారి సూచించారు. గురువారం రామన్నపాలెం అడవిపర్ర, సుబ్రహ్మణేశ్వరస్వామి గుడి ప్రాంతాల్లో ఆకుమడులు వేసిన పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. మండలంలో 980 ఎకరాలలో సార్వా సాగు చేపట్టనున్నారని అంచనా వేస్తుండగా సుమారు 70 ఎకరాల్లో మాత్రమే ఆకుమడులు వేయడం పూర్తయిందన్నారు. ఆకుమడులు వేయని రైతులు వెదజల్లే పద్ధతి పాటించి ఎకరాకు 12 నుంచి 15 కిలోల విత్తనాలు జల్లాలని, ఆకుమడుల్లో నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న భక్తులు

పెనుమంట్ర, జూలై 11: విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం మోహిద్దీన్ బాద్‌షా జయంతి సందర్భంగా పొలమూరులో మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో పి. పద్మజ, తహసీల్దార్ కె. లక్ష్మీ కళ్యాణి మాట్లాడుతూ ప్రకృతి సమతుల్యం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కలిదిండి రామ్మూర్తి సుభద్రమ్మలను అభినందించారు. కోఆర్డినేటర్ శిరిడి సత్యనారాయణ, సర్పంచ్ కాకర రాజేశ్వరరావు మాజీ సర్పంచ్ చింతపల్లి రామకృష్ణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పెనుమెత్స వివేక రాఘవేంద్ర రాజు పాల్గొన్నారు

రహదారి పనులకు శంకుస్థాపన

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 11: పట్టణంలోని నన్నయ యూనివర్సిటీ నుంచి ఎన్‌హెచ్-16, ఏరియా ఆసుపత్రి తూర్పుగేటు తదితర రహదారుల పనులకు ఎమ్మెల్యే బొలిశెట్టి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో శశి విద్యాసంస్థల అధినేత బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ జి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఆ తరువాత పట్టణంలోని 11వ వార్డులో ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారిని వారు దర్శించుకుని పూజలు చేశారు.

రజకుల ధర్నా

ఆకివీడు, జూలై 11: కోళ్ళపర్రులో రజకులు ధర్నా చేశారు. సుమారు 75 ఏళ్ళగా వృత్తి చేసుకుంటున్న రజకుల చెరువును ఇళ్ళ స్థలాలకు రెవెన్యూ అధికారులు కేటాయించడంతో హైకోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు.హైకోర్టు మధ్యంతర ఉత్వర్వులు ఇచ్చినా, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళినా న్యాయం జరగలేదన్నారు.

సీతారాంపేటలో ఆషాఢం పూజలు



తాడేపల్లిగూడెం రూరల్, జూలై 11 : తాడేపల్లిగూడెం పట్టణం సీతారాంపేటలోని సీతారామాలయంలో గురువారం ఆషాఢం పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నరిసే సోమేష్ సీతమ్మకు ఆషాఢం సారె సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అయినం బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పంటకాల్వ అభివృద్ధి చేయాలని వినతి

ఉండి జూలై 11:ఉండి నుంచి పాములపర్రు గ్రామంలోని మంచినీటి చెరువుకు వెళ్లే పంటకాలువ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజుకు, అధికారులకు సర్పంచ్ కేశన శాంతకుమారి, ఉపసర్పంచ్ వర్రే పెదరాఘవులు వినతిపత్రం అందించారు. గురువారం రామాపురం వద్ద తరుచు కాలుష్యం బారినపడుతున్న పంటకాలువను పరిశీలించారు. ఈపంటకాలువే తమ గ్రామప్రజలకు మంచినీటికి ఆధారమన్నారు. ఈకాలువ వెంబడి ఆక్రమణలు వుండడంతో మంచినీరు కాలుష్యం బారినపడుతుందన్నారు. ఈసమస్యను పరిష్కరించాలని కోరారు.

ఎంఈవో- 2ల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రామకృష్ణ

పెంటపాడు, జూలై 11 : ఎంఈవో-2ల సమస్యలను పరిష్కరించాలని ఎంఈవో-2 అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ టీవీ.రామకృష్ణ గురువారం విజయవాడలో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఎంఈవో-1, ఎంఈవో-2లు ఇద్దరికి సమాన అధికారాలు ఇవ్వాలని, వారు పనిచేస్తున్న మండలాలను రెండు సెక్టారులుగా విభజించి సమాన హక్కులు ఇవ్వాలని కోరారు.

స్కాలర్‌షిప్‌లు అందేలా కృషి



కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మను అభినందిస్తున్న జిల్లా మాజీ ఏబీఎస్ఎఫ్ నాయకులు

భీమవరం క్రైం, జూలై 11 : పేద, వెనుకబడిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందేలా కృషి చేస్తానని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. జిల్లా మాజీ ఏబీఎస్‌ఎఫ్ నాయకులు గురువారం ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్, హెల్త్‌కార్డులు పూర్తిస్థాయిలో అందరికి అందుబాటులో ఉండే విధంగా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎబిఎస్ఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షులు చెల్లబోయిన రంగారావు, రవికుమార్, వెంకట బోస్ పాల్గొన్నారు.

జానాభా పెరుగుదలతో అభివృద్ధికి ఆటంకం



భీమవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు, జూలై 11: జనాభా పెరుగుదల వల్ల దేశాభివృద్ధికి ఆటంకమని ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజ రాజేశ్వరి అన్నా రు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీకే మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యవక్తగా ఆర్థిక శాస్త్ర అధ్యాపకులు ఏలూరి శ్రీనివాసరావు వ్యవహరించారు.

పాలకోడేరు: తల్లిబిడ్డల సంరక్షణ కోసం, ఆరోగ్యం కోసం జాగ్రత్తలు పాటించాలని పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్‌వీ రంగం నాయుడు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని పాలకోడేరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వివాహ వయస్సు వచ్చిన తరువాతే వివాహాలు జరిపించాలని అప్పుడే తల్లిబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ స్వర్ణ నిరంజని, సీహెచ్‌ఓ సత్యనారాయణ, సూపర్‌వైజర్లు అమ్మాజీ పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: లంకలకోడేరు పీహెచ్‌సీ డాక్టర్ నవ్య జీవన్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభకు సర్పంచ్ చొప్పల రజనీ అధ్యక్షత వహించారు. డాక్టర్ ప్రతాప్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్: ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న జనాభా వల్ల ఏర్పడే సమస్యలపై స్థానిక వీవర్స్ కాలనీలోని మున్సిపల్ ఎలిమెంట్రీ పాఠశాలలో హెచ్‌ఎం భవానీప్రసాద్ విద్యార్థులకు అవగాహన కలిగించారు. పాఠశాలలో బుధవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విద్యార్థులచే దేశ భక్తి ప్రతిజ్ఞ చేయించారు. కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం, పేదరికం, మాతృ ఆరోగ్యం, మానవ హక్కులుపై విద్యార్థులకు అవగాహన కలిగించారు.

భీమవరం టౌన్: జనాభా నియంత్రణకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆ దిశగా వైద్య ఆరోగ్య అధికారులు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు అన్నారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవ సందర్భంగా పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది.

డెంగీపై అవగాహన ర్యాలీ



పెంటపాడు, జూలై 11: ముదునూరు పీహెచ్‌సీ పరిధిలోని ప్రత్తిపాడు, అలంపురం గ్రామాల్లో డెంగీ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ.లక్ష్మణరావు, ఆరోగ్య సిబ్బంది అన్నపూర్ణ, మృదుల, కీర్తి, శరణ్య, మాధవీలత పాల్గొన్నారు.

నేడు నరసాపురం మండల సమావేశం

నరసాపురం రూరల్, జూలై 11: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో వీరభద్రరావు తెలిపారు. ఎంపీపీ సోని అధ్యక్షతన ఉదయం 10గంటలకు జరిగే సమావేశానికి ఎమ్మెల్యే నాయకర్ ముఖ్య అతిథిగా విచ్చేస్తారన్నారు. అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి



భీమవరం క్రైం, జూలై 11 : వాహనదారులు హెల్మెట్‌ధారణ ప్రాణ రక్షణకు మార్గదర్శకమని అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వి. భీమారావు అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అవగాహన ప్రచార బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఏఎస్పీ భీమారావు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు ప్రతీ ఒక్కరూ పాటించాలని, ప్రజల్లో అవగాహన రాహిత్యం నిర్లక్ష్య ధోరణితో ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీకాంత్, దేశంశెట్టి వెంకటేశ్వరరావు, లయన్స్ క్లబ్ పట్టణ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు పనుల పరిశీలన

ఉండి జూలై 11:ఉండిలోని కలిదిండి అబ్బాయిరాజు పార్కు వద్ద వున్న ఆక్రమణల తొలగింపు పనులను అధికారులు పరిశీలించారు. ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు ఆదేశాలతో ఆపనులను పూర్తిచేసే కార్యక్రమంలో అధికారులున్నారు. గురువారం ఎండీవో రవీంద్ర, ఈవోపీఆర్‌డీ రామకృష్ణారెడ్డి, గ్రామకార్యదర్శి గోపాలకృష్ణ ఆప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. వారు మాట్లాడుతూ గతంలోనే ఇక్కడ ఎటువంటివి ఏర్పాటు చేయవద్దని నోటీసులు అందించామని, వాటిని పెడచెవినపెట్టారని అన్నారు. ఈప్రాతమంతా క్లీన్‌గా వుండాలని అధికారులు సూచించారు.

మావుళ్ళమ్మ ఆలయానికి బంగారం అందజేత



భీమవరం టౌన్. జూలై 11 : మావుళ్ళమ్మ ఆలయానికి పట్టణానికి చెందిన అల్లూరి మనోజ్ వర్మ, నాగశృతి దంపతులు 8 గ్రాముల బంగారం అందించారు. దాతలకు ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి, నగేష్ ప్రసాదం శేషవస్త్రం, అమ్మవారి ఫొటో అందించారు.

సచివాలయాల అధికారి అప్పారావుకు డాక్టరేట్



కలెక్టర్ నాగరాణిని కలసిన సచివాలయాల అధికారి అప్పారావు

భీమవరం టౌన్, జూలై 11: కలెక్టరేట్ కార్యాలయములో జిల్లా గ్రామ వార్డు సచివాలయాల అధికారిగా పనిచేస్తున్న కె.సి.హెచ్. అప్పారావు కుప్పంలోని ద్రవిడ విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్‌ను ఈనెల 9వ తేదీన అందుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా వచన కవిత్వం-సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిశీలన అన్న సిద్ధాంత గ్రంధాన్ని సమర్పించినందుకు గాను ఆయనకు ఈ అవార్డును ద్రవిడ విశ్వవిద్యాలయం ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయనను జిల్లా కలెక్టర్ సి.నాగరాణి, జాయింట్ కలెక్టర్ సి.వి.ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, కలెక్టరేట్ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

21 మంది ఎంపిక

తణుకు, జూలై 11 : చిట్టూరి ఇంద్రయ్య స్మారక ప్రభుత్వ కళాశాలలో గురువారం జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 21 మంది ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అనిల్‌కుమార్ తెలిపారు. గురువారం ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

నేడు డయల్ యువర్ డీఎం

భీమవరం డిపో పరిధిలో ఉన్న ఐదు మండలాల ప్రయాణికుల నుంచి ఆర్టీసీకి సంబంధించిన సమస్యలను తెలుసుకునేందుకు, సలహాలను స్వీకరించేందుకు శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ డయల్ యువర్ డి.ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆర్టీసి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు. సెల్ నెంబర్ 99592 25485 కు ఫోన్ చేసి సమస్యను తెలిపాలని డీఎం సత్యనారాయణ మూర్తి కోరారు.

మానవతకు ఆక్సిజన్ పరికరం అందజేత



పాలకొల్లు రూరల్, జూలై 11 : యలమంచిలికి చెందిన తమ్మినీడి మూర్తి, కృష్ణ కిషోర్ అమెరికాలో ఉంటున్నారు. ఈ సోదరులు ఇద్దరు సుమారు రూ.75వేల విలువైన ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్‌ను తమ తల్లి అంజలీ దేవి ద్వారా మానవతా సంస్థకు బుధవారం అందించారు. కార్యక్రమలో ఫాస్ట్ ప్రెసిడెంట్ ముత్యాల శ్రీనివాస్, సభ్యులు మేడికొండ రాందాస్, బోళ్ళ వీరాస్వామి, తమ్మినీడి మురళీకృష్ణ, సాయి పాల్గొన్నారు.

ఎస్ఎన్‌వీటీ కాలేజీకి కంప్యూటర్ అందజేత

తణుకు, జూలై 11 : మానవత సేవాసంస్థ ఆధ్వర్యంలో తణుకులోని ఎస్ఎన్‌వీటీ జూనియర్ కళాశాలకు కంప్యూటర్ బహూకరించారు. గురువారం జరిగిన కార్యక్రమంలో అమెరికన్ టెలిఫోన్, టెలి కమ్యూనికేషన్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ వారిచే రెండు లక్షల 25 వేల విలువగల మూడు హెచ్‌పీ కంప్యూటర్‌లు ఇచ్చారని, వాటిలో ఒకటి కళాశాలకు, పెనుగొండ డిగ్రీ కాలేజి టాపర్‌కు ఒకటి, మరొకటి కడప మానవత సంస్థకు అందించినట్టు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, డాక్టర్ కోడూరి రాధాపుష్పావతి, బోయపాటి రామలక్ష్మి పాల్గొన్నారు.

కళాకారుడు శివ లింగేశ్వరరావు సంస్మరణ సభ

ఆకివీడు, జూలై 11: ఇంద్రజాల ప్రదర్శనలో సుమారు రెండు దశాబ్దాలుగా ప్రజల మన్ననలు అందుకున్న కళాకారుడు ఘంటసాల శివ లింగేశ్వరరావు అని వక్తలు పేర్కొన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో మరణించిన కళాకారుడు శివ లింగేశ్వరరావు సంస్మరణ సభ గురువారం శాంతినగర్ నూకాలమ్మ దేవాలయ ప్రాంగణంలో జరిగింది. సరిగమ సంగీత పరిషత్ వ్యవస్థాపకుడు సింగవరపు కోటేశ్వరరావు, కొల్లి వెంకన్నబాబు, ఆట్లూరి రంగారావు, జి.వెంకటేశ్వరరావు, పాలకోడేరు మిమిక్రీ కళాకారుడు వీరవల్లి రాంబాబు పాల్గొన్నారు.

'అధికారుల సమన్వయ లోపం'

అత్తిలి, జూలై 11: మండలంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవడంలో విఫలం కావడంతో ప్రభుత్వ పథకాలు ప్రజలకు తెలియడం లేదని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పూతినీడి శ్రీనివాసరావు, జనసేన పట్టణ అధ్యక్షుడు కూసంపూడి ప్రభాకరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొన్ని శాఖలకు అధికారులు లేకపోవడం ఒక సమస్య.. ఉన్న అధికారులు సమాచారం ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వ ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తుంటే దాని విధివిధానాలు చెప్పేనాథుడు లేరన్నారు.

13న విదేశీ విద్యపై అవగాహన

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 11 : ఈనెల 13న భీమవరం ఆనంద ఫంక్షన్ హాల్లో వోక్స్ ఓవర్సీస్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్, మెడిసిన్ విదేశీ విద్యపై (ఇంటర్నేషనల్ పేర్) ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు వోక్స్ ఓవర్సీస్ కార్పొరేట్ రిలేషన్షిప్ మేనేజర్ ఎంఎస్ షరీష్ తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9966166659, 9032525044, 9704954807లను సంప్రదించాలని కోరారు.